క్లుప్తంగా

28న కాండ్రేగుల నూకాలమ్మ తీర్థం



నూకాలమ్మవారు

పెదపూడి: కాకినాడ జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం కాండ్రేగులలో నూకాలమ్మ తీర్థమహోత్సవం ఈ నెల 28న ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 27న రాత్రి అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. నూకాలమ్మ తీర్థానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరవుతారు. అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, ఆలయం ఎదురుగా ప్రాంగణంలో భక్తులు వేచి ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జి.మామిడాడ, కరప, కూరాడ, పెదపూడి రోడ్లు కూడలి మీదుగా వచ్చే భక్తులకు రవాణా ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నిబంధనల ప్రకారం సుమారు కిలోమీటర్ మేర పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. కొత్తగా వివాహం చేసుకున్న దంపతులు, వాహనాలు కొనుగోలు చేసిన వారు అమ్మ వారిని దర్శించి, పూజలు చేస్తారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి పర్యవేక్షిస్తున్నామని ఆలయ ఈఓ జి.శివబాబు, ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం

బిక్కవోలు: ఆరికరేవులలోని సత్తెమ్మతల్లి సంబరం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

పోలేరమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ పోలేరమ్మ ఆలయం వద్ద శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకూ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

సీతానగరం: ఓటర్ల నమోదు నిరంతరం ప్రక్రియ అని తహసీల్దార్ ఎ శ్రీనివాస్ బీఎల్వోలకు సూచించారు. శనివారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోల సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌తోపాటు నియోజకవర్గం ఎలక్షన్ డీటీ కుమారి పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులను గుర్తించి సరిచేయాలన్నారు. అన్ని అంశాలను సరిగా పూర్తి చేయాలని, మృతి చెందిన వారి పేర్లు తొలగించాలన్నారు. త్వరలో ఓటరు కార్డుకు ఆధార్ లింక్ చేస్తామన్నారు. ఫారమ్ 6 ఓటర్లుగా నమోదు చేయడానికి, ఫారమ్ 7 తొలగింపులు, ఫారమ్ 8 సవరణ, బదిలీలుగా ఉపయోగించాలన్నారు. పలువురు బీఎల్వోలు పాల్గొన్నారు.

సేద్యపు నీటిగుంతకు శంకుస్థాపన

సీతానగరం: కూనవరం మాదవరపు కృష్ణార్జునరావు పంట పొలంలో సేద్యపు నీటి గుంతకు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగశేషవేణి ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన చేశారు. ఐదు మీటర్లు పొడవు, ఐదు మీటర్లు వెడల్పు, రెండు మీటర్ల లోతు కలిగిన సేద్యపు నీటిగుంతకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ పనికి అంచనా రూ.38 వేలు, 121 పనిదినాలతో సేద్యపు నీటిగుంటను ఏర్పాటు చేస్తామని ఏపీవో తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు వీర బాబు, చక్రవర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు భాస్కర్, నరసింహమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణం కోసం అదనపు ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజానగరం: సొంతింటి నిర్మాణాలు చేపట్టిన పేదలకు అదనపు ఆర్థిక సాయాన్ని అందించి, చేయూతనిస్తున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని తోకాడలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అదే గ్రామానికి చెందిన ఎస్సీ లబ్ధిదారు యాగీ యోగేశ్వర్‌కు మంజూరైన రూ. 50 వేలు అదనపు ఆర్థిక సాయంలో భాగంగా తొలి విడతగా రూ.15 వేలను మంత్రి అందజేశారు. గృహ నిర్మాణ పనులను బట్టి నాలుగు విడతలుగా ఈ సాయాన్ని అందిస్తారన్నారు. కలెక్టరు పి.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాలు చేపట్టిన వారికి ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సాయం అంశాన్ని 9,496 మందికి తెలియజేశామని, 5,257 మంది ముందుకు వచ్చారన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేపి రూన్సీ, తహసీల్దారు జీఎల్ఎస్ దేవి, గృహ నిర్మాణ శాఖతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో విద్యుత్ సమస్యలకు చెక్

- పలు ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- నేడు పల్లెల్లో విద్యుత్ వెలుగులు
- లో ఓల్టేజీ సమస్య పరిష్కారం
- రైతులు, గృహవినియోగదారుల హర్షం



వైఎస్సార్ సీపీ హయాంలో చినకొండేపూడిలో నెలకొల్పిన విద్యుత్ సబ్ స్టేషన్

సీతానగరం: గతంలో వేసవి వచ్చిందంటే విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండేది. ఏ సమయంలో విద్యుత్ నిలిపివేస్తారోననే భయాందోళనలో ప్రజలు ఉండేవారు. ఒక పక్క మండుటెండలు, ఉక్కపోత, మరో పక్క విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి పలు సమస్యలు ఉత్పన్నమయ్యేవి. యువకులు, వృద్ధులు, పిల్లలు, మహిళలు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడేవారు. వేసవిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం, పాడైపోవడం, రెండు రోజులు ఇళ్లకు కరెంట్ లేకపోవడం వంటి పలు సమస్యలుండేవి.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మార్గం సుగమం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విద్యుత్ సమస్యకు చెక్ పెట్టారు. నియోజకవర్గం గ్రామాల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మే విధంగా నియోజకవర్గంలో పలు గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా పలు గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి, లో ఓల్టేజి సమస్యకు చెక్ పెట్టారు. సీతానగరం మండలంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు రూ.5.04 కోట్ల నిధులతో ఏర్పాటు చేశారు. కాటవరం, చినకొండేపూడిలో విద్యుత్ ఉప కేంద్రాలను నెలకొల్పారు. రాజానగరం, కోరుకొండ మండలాల్లోని రాధేయపాలెం, వెలుగుబంద, నరసాపురంలో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో 33/11 కేవీ విద్యుత్ కేంద్రాలను నెలకొల్పారు. దీంతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మార్గం సుగమం అయింది.

తొలగిన రైతుల ఇక్కట్లు

కొన్ని దశాబ్దాలుగా నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలున్నా వాటి పరిష్కారానికి పాలకులు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. 2009 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలో ఒక్క విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీతానగరం మండలంలో కాటవరం సబ్‌స్టేషన్ నిర్మాణంతో జాలిమూడి, మునికూడలి, కూనవరం, చినకొండేపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రఘుదేవపురం, సీతానగరం, చినకొండేపూడి, సింగవరం, చీపురుపల్లి, నాగంపల్లిలో నాణ్యమైన విద్యుత్ అందించడమే కాకుండా వ్యవసాయ రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. లో ఓల్టేజి సమస్య పరిష్కారమైంది. ప్రతి రైతుకూ ఉచితంగా పగటిపూట నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో వేసవి వచ్చినా నియోజకవర్గం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నేడు విద్యుత్ సరఫరా అయ్యేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

వేసవిలో ఇబ్బంది పడేవాళ్లం



కొన్ని దశాబ్దాలుగా విద్యుత్ సమస్యలుండేవి. వేసవి వచ్చిందంటే కరెంట్ ఉండదని భయంతో ఉండేవాళ్లం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కరెంట్ పోవడం అనేది లేదు. లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైంది. అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విద్యుత్ సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసి, సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

– తోరం శోభనబాబు, రైతు, లంకూరు

తొలగిన సమస్యలు



మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గతంలో విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టారు. ఇప్పుడు వేసవి వచ్చిందంటే నిశ్చింతగా ఉంటున్నాం. వైఎస్సార్‌సీపీ హయాంలో లో ఓల్టేజీ సమస్య, విద్యుత్ నిలిచిపోవడం వంటి సమస్యలు లేవు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించి లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం చూపారు.

– పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్‌బాబు), వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, సీతానగరం

మహిళల రక్షణ కోసం నూతన చట్టాలు



పెద్దాడలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి లీలాశ్యామ్ సుందరి

పెదపూడి: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కాకినాడ జిల్లా పీఎస్‌సీఏ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ లీల శ్యామ్ సుందరి అన్నారు. పెద్దాడలో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన లేక కొంతమంది చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం నూతన చట్టాలను రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. దానిలో భాగంగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాల మేరకు పోక్సో చట్టంపై విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.రామారావు, ఏఎస్సై శ్రీనివాసు, సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీగౌరీ, శ్రీపద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు ఘనుడు

- ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో వ్యతిరేకత
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



అనపర్తిలో వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ

పెదపూడి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనుడని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. అనపర్తిలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గం కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన బిక్కవోలు, రంగంపేట మండలాల పార్టీ ముఖ్యనేతలతో ఆయన సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన పది నెలల కాలంలోనే ప్రజలను నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజల పక్షాన ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల బిక్కవోలు మండల ఎంపీపీ తన పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. సభ్యుల ఏకాభిప్రాయం మేరకు ఎంపీపీ పదవికి బలభద్రపురం ఎంపీటీసీ సభ్యురాలు సబ్బెళ్ల సుజాతా వీర్రాఘవరెడ్డిని పార్టీ తరుపున ఎంపిక చేశారన్నారు. ఇటీవల రంగంపేట మండలం కోఆప్షన్ సభ్యుడు పదవి ఖాళీ అయింది. బాలవరానికి చెందిన కరుపోతు సత్యనారాయణను ఎంపీటీసీ సభ్యులు, ముఖ్యనేతల ఏకగ్రీవ అభిప్రాయంతో కోఆప్షన్ సభ్యుడిగా ఎంపిక చేశారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సంయుక్తంగా వారి అభ్యర్థిత్వాలను ప్రకటించారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి టౌన్ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన్‌బాలకృష్ణారెడ్డి, బిక్కవోలు మండల అధ్యక్షుడు పోతుల ప్రసాద్‌రెడ్డి, కొంకుదురు సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తినాగిరెడ్డి, కొంకుదురు ఎంపీటీసీ సభ్యుడు పీవీ, పందలపాక గ్రామశాఖ అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, కాపవరం సర్పంచ్ సత్యం శెట్టి వెంకటరమణ, గుబ్బల అలేఖ్యలాజర్‌బాబు, రంగంపేట మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఎంపీపీ అబ్బు, జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, కొల్లాటి ఇజ్రాయేలు, పడాల దుర్గారెడ్డి పాల్గొన్నారు.

పశువులకు నీళ్లు అందుబాటులో ఉంచాలి



సీతానగరం మండల పరిషత్ కార్యాలయం సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: గ్రామాల్లోని చెరువుల్లో పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉంచి పశువులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎ శ్రీనివాస్ సూచించారు. శనివారం సీతానగరం మండల పరిషత్ కార్యాయలంలో మండలస్థాయి శాఖాధికారులతో వేసవిలో తీసుకునే చర్యలపై అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఎమ్ భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా పెరిగే అవకాశం ఉందని, గ్రామాల్లో దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉపాధిహామీ పథకం పనులు ఉదయం 11 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. చెరువుల్లో నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో భారతి మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా ప్రతి గ్రామంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ పైప్‌లైన్ల మరమ్మతులకు గురికాకుండా చూడాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు ఏవీకె చైతన్య మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటివి వేసవికాలంలో తరచూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, మండల వ్యవసాయాధికారి కె సూర్యరమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యసాయి ప్రకాష్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్యాన్సర్ లక్షణాలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే



బలభద్రపురంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో ఇంటింటి సర్వే ద్వారా క్యాన్సర్ లక్షణాలున్నవారిని గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం, వైద్య నిపుణుల సూచనలు సలహాల మేరకు ప్రజలకు తగిన వైద్య చికిత్స అందజేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం ఆమె బలభద్రపురంలోని ఇంటింటి సర్వేను క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని 2,492 గృహాల్లో సుమారు 10 వేలు జనాభా ఉన్నారన్నారు. వీరిలో ఎక్కువగా క్యాన్సర్ కేసుల నమోదు నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ఇందుకోసం ఏడుగురు స్పెషలిస్ట్ వైద్యులు, ఎనిమిది మంది డాక్టర్లు, 98 సిబ్బంది ఆధ్వర్యంలో 31 బృందాలను నియమించామన్నారు. వీరు ఇంటింటి ఆరోగ్య సర్వే ద్వారా ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. వైద్య నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 23 మందికి క్యాన్సర్ లక్షణాలున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధి వైద్య నిపుణుల సూచనలు సలహాలను అనుసరించి క్యాన్సర్ కేసుల గుర్తించి తదుపరి వైద్య పరీక్షలను చేపట్టనున్నట్లు తెలిపారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల నుంచి స్పెషలిస్ట్ వైద్యులు, అంకాలజిస్టుల సూచనలను అనుసరించి వైద్య పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, కాకినాడ జీజీహెచ్ ఎస్సీ ఎం.హెచ్‌వోడీ డాక్టర్ పి.సుజాత, బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి, సర్పంచి బుంగా రామారావు, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సంకల్ప్ జాబ్ మేళాలో 204 మంది ఎంపిక

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహించిన సంకల్ప్ జాబ్ మేళాలో జిల్లా వ్యాప్తంగా 503 మంది హాజరుకాగా 204 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా ప్రారంభ సభలో జాయింట్ కలెక్టర్ చినరాముడు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులందరూ ఈ సంకల్ప ఉద్యోగ మేళాలో వచ్చిన ఉద్యోగాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వీడీజీ మురళి కంపెనీ ప్రతినిధులను పరిచయం చేస్తూ, ఉద్యోగ అవకాశాలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ కళాశాలలో ఈ విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో సంకల్ప్ జాబ్ మేళ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ జాబ్ మేళాలో 33 కంపెనీలు పాల్గొన్నాయని కళాశాల జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్‌రెడ్డి తెలిపారు.

సేవాదృక్పథంతో నర్సులు వైద్య సేవలందించాలి



ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాజానగరం: ఆస్పత్రిలో చికిత్స పొందే రోగుల మానసిక, ఆరోగ్య పరిస్థితులు వైద్యుల కంటే సేవలందించే నర్సులకే ఎక్కువగా తెలుస్తుందని, సేవాదృక్పథం, ఓర్పు, సహనంతో నర్సులు వైద్య సేవలందించాలని జీఎస్ఎల్ వైద్య కళాశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. కళాశాల ప్రాంగణంలో శనివారం జీఎస్ఎల్, స్వతంత్ర నర్సింగ్ కళాశాలల 2025 బ్యాచ్ ఫ్రెషర్స్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి మాట్లాడుతూ కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి సుదూర ప్రాంతాల నుంచి నర్సింగ్ విద్య కోసం ఇక్కడికి వచ్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పలు కుటుంబాలకు జక్కంపూడి రాజా పరామర్శ



చినకొండేపూడిలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం/మధురపూడి: కోరుకొండ, సీతానగరం మండల గ్రామాల్లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పలు కుటుంబాలను పరామర్శించారు. శనివారం కోరుకొండ మండలం కోటి కేశవరంలో ఇటీవల మరణించిన మాసా ఏసు, కొమరపు నాగరాజు కుటుంబ సభ్యులను జక్కంపూడి రాజా పరామర్శించారు. బొల్లెద్దులపాలెంలో పనసల పండు మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కర్రి మహాలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాపవరంలో ఆరోగ్య సమస్యలతో విశ్రాంతి తీసుకుంటున్న గుమ్మళ్ల భాను తండ్రిని, విశ్రాంతి తీసుకుంటున్న గుగ్గిలం శేషబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీతానగరం మండలంలో కూనవరంలో ఆరోగ్య సమస్యలతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న అడప సూర్యనారాయణ, కొల్లు బోడియ్య, సుంకర నరసింహం మావయ్యను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిక్కాల విష్ణు, ఆముదాల పద్మావతి, డాక్టర్ రాజు మనుమరాలు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చినకొండేపూడిలో బోడే రాముడు, జక్కంపూడి సత్యనారాయణలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కారణంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముగ్గళ్ల, మునికూడలి తదితర గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, చల్లమళ్ల సుజీరాజు, పోలినాటి ఈశ్వరుడు, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, కోనే ఇంద్ర, యర్రంశెట్టి బాబులు, ద్వారంపూడి రామకృష్ణ, ముదునూరి రామకృష్ణరాజు పాల్గొన్నారు.

26న మండల పరిషత్ సమావేశం

రంగంపేట: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 26వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి. వీర సాయిబాబు శనివారం పేర్కొన్నారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు, మండలంలోని ప్రజా ప్రతినిధులందరూ హాజరవుతారని తెలిపారు.న్నారు.

ఇంటి పన్నుల వసూలు వేగవంతం

పెదపూడి: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వసూళ్లు 90 శాతం మేర పూర్తయిందని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన సంపరలో ఇంటి పన్నులు వసూలు వసూలు చేస్తున్న ప్రక్రియను పరిశీలించి మాట్లాడుతూ మండలంలో మొత్తం రూ.1,49,67,316 వసూలు చేయాల్సి ఉండగా వాటిలో రూ.1,34,70,584 వసూలు పూర్తి చేశారన్నారు.

జల వనరులను సంరక్షించుకోవాలి

పెదపూడి: జలమే జీవనాధారమని, నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదని ఈ నేపథ్యంలో నీటిని సంరక్షించుకుంటూ, పొదుపుగా వినియోగించుకోవాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడిలో ప్రపంచ జల దినోత్సవాన్ని శనివారం ఉపాధి కూలీలతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ప్లకార్డు చేతపట్టి నీటి ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జల వనరుల సంరక్షణ, మెరుగైన నీటి వనరుల వినియోగం ప్రపంచ జల దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. నీరు పుష్కలంగా లభించే కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నారన్నారు. నీటిని వృథా చేయడంతో భవిష్యత్తులో జలం కోసం తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. భుగర్భ జలాలను పెంచడం, వర్షపునీటిని ఒడిసిపట్టి ఆ నీటిని సక్రమంగా వినియోగించడంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సత్యనారాయణ, టెక్నికల్ అస్టింట్, పాల్గొన్నారు.

సేద్యపు నీటి కుంటలతో భూగర్భ జలాల వృద్ధి

రాజానగరం: భూగర్భ జలాలు తరిగిపోకుండా వృద్ధి చేయడంతోపాటు భావి తరాలకు నీటి సమస్యలు రాకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సేద్యపు నీటి కుంటల ఏర్పాటుకు కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని తోకాడలో జాతీయ గ్రామీణ అభివృద్ధి పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా సేద్యపు నీటి కుంటల ఏర్పాటుకు ఆయన శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కలెక్టరు పి. ప్రశాంతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పెదపూడి: పిల్లలు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటుపడి చెడు మార్గం పట్టకుండా తల్లిదండ్రులు ప్రేమతో మెలిగి, బాధ్యతగా వ్యవహరించాలని ఈఓపీఆర్డీ ఎం సత్యనారాయణరెడ్డి అన్నారు. పుట్టకొండ గ్రామంలో యువత మేలుకో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన సదస్సు శనివారం ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మత్తు కోసం మందులు వినియోగించే యువత జీవితాలు ఏవిధంగా నాశనమవుతున్నాయో వివరించారు. ఎక్సైజ్ ఎస్సై మోహన్ రావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సర్పంచి వల్లు వెంకటరమణ, ఉప సర్పంచి మిరియాల శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు దెయ్యాల నారాయణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కేతా సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి యడ్లపల్లి కొండలరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్తు అంధకారం

మధురపూడి: డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుకొండ సీఐ సత్యకిషోర్ అన్నారు. శనివారం కోరుకొండలో పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సై శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.